క్లుప్తంగా

ఐటీడీఏ పీఓకు వినతి



మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లాలో గిరిజనల సమస్యలపై అందుబాటులో ఉండని, పోడు భూములపై రుణాలు ఇప్పించడంలో విఫలం అయిన డీడీని సస్పెండ్ చేయాలని గిరిజని శాఖ ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు సోమవారం ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తేజావత్ వాసు నాయక్ బోడ రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్య తీసుకోవాలి

గూడూరు: మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహ వార్డెన్‌పై చర్య తీసుకోవాలని టీబీఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య సురేష్‌నాయక్ సోమవారం ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

ఉక్కు పరిశ్రమపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వాలు



బయ్యారం: రాజకీయస్వార్థం కోసం పాలకవర్గాలు బయ్యారం ఉక్కును వినియోగించుకుంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో బయ్యారం ఉక్కుపరిశ్రమ ఏర్పాటు అంశం ఉన్నప్పటికీ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయడం లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజన్న, మధు, ఆనందరావు, విజయ, నాగేశ్వరరావు, వెంకన్న, చంటి, తిరుపతిరావు, యాకూబ్, పురుషోత్తం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 11న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9గంటలకు జిల్లాస్థాయి సీనియర్ పురుషుల జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల సంజీవరావు, సెక్రటరీ కల్లూరి ప్రభాకర్ సోమవారం తెలిపారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు తెచ్చుకోవాలని, ఇందులో ఎంపికైన వారు ఈనెల 13, 14, 15 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

అంగన్‌వాడీల ఉద్యోగ విరమణ



గూడూరు: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో సోమవారం ఐదుగురు అంగన్‌వాడీ టీచర్లు, 29మంది హెల్పర్లు పదవీ విరమణ పొందినట్లు సీడీపీఓ నీలఫర్‌అజ్మీ తెలిపారు. వారికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి, శాలువాలతో ఘనంగా సన్మానం చేసినట్లు సీడీపీఓ తెలిపారు.

హామీల అమలులో విఫలం

తొర్రూరు: హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి ఎండీ యాకూబ్ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. నేటి నుంచి మండల వ్యాప్తంగా ఇంటింటికి సీపీఎం కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డి, సాంబయ్య, సాయిమల్లు, యాకయ్య, శ్రీను పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం వరంగల్ ఐటీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మదన్‌మోహన్, శోభారాణి దంపతులు వారి తల్లిదండ్రులు జానకి, నర్సయ్య జ్ఞాపకార్థం 20 మంది విద్యార్థులకు పంపించిన మాథ్స్ స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎం రుక్మాంగధరరావు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అగ్బర్‌ఖాన్, అమీన్, స్వామి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

గార్ల: ఈనెల 20, 21 తేదీలలో గార్లలో జరిగే రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ సోమవారం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు వెంకన్న, మనోహర్, వెంకన్న పాల్గొన్నారు.

ఇరుముడి పూజలు

కురవి: సీరోలు మండలం చింతపల్లి శివారు పెద్దలాల్ తండాలో సోమవారం బీకోజీ గురుస్వామి ఆధ్వర్యంలో 28 మంది అయ్యప్ప మాలధారణ చేసిన స్వాముల ఇరుముడి పూజలు ఘనంగా జరిగాయి. ఇరుముడి ధరించిన స్వాములు శబరిమల బయలుదేరి వెళ్లారు.

'అమ్మ'కు నిధుల కోత

- 25శాతం నిధులు నిలిపివేత
- ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల నిర్వాహకుల ఆందోళన



అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైన సీతారాపురం ప్రాథమికోన్నత పాఠశాల

నెల్లికుదురు: నిరుపేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని విధాలుగా తీర్చి దిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట మరమ్మతులకు 2024–25 విద్యా సంవత్సరంలో మండలంలోని వివిధ గ్రామాల 31 పాఠశాలలు ఎంపీపీఎస్, యూపీఎస్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.1.11కోట్లు నిధులు మంజూరు చేశారు. నిధులతో పాఠశాలల గదుల మరమ్మతులు, తాగునీరు విద్యుత్, మరుగుదొడ్లు మేజర్, మైనర్ తదితర సౌకర్యాల కోసం ఒక్కొక్క పాఠశాలకు పాఠశాలలను బట్టి రూ.1.7లక్షల నుంచి రూ.13.2లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామాల మహిళా సంఘాల లీడర్లను పాఠశాల కమిటీ చైర్మన్లుగా నియమించి మరమ్మతుల నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వం వారికి అప్పగించింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 31పాఠశాలలు పనులు పూర్తి అయ్యాయి, కాని కొన్ని గ్రామాలల్లో పనులు పూర్తి కాలేదు. నిర్వాహకులకు 75శాతం నిధులు మంజూరు చేశారు. మిగిలిన 25శాతం నిధులు ఎంపీడీఓ ఖాతాలో జమ అయ్యాయని, ఇవ్వాలని అడిగితే జీఎస్టీ, క్వాలిటీ కంట్రోల్ తదితర ఖర్చులుంటాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి 25శాతం నిధులు విడుదల చేయాలని నిర్వాహకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నిధులు నిలిపిన మాట వాస్తవమే



అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను పనులు పూర్తి చేసిన నిర్వాహకులకు 25శాతం నిధులు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నిలిపేశాం. అధికారుల ఆదేశాల మేరకు సమస్య పరిష్కరిస్తాం.

– బాలరాజు, ఎంపీడీఓ, నెల్లికుదురు

సర్వేనుంచి మినహాయింపు ఇవ్వాలి

- రాష్ట్ర జీపీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్



డీపీఓకు వినతిపత్రం ఇస్తున్న ఫెడరేషన్ నాయకులు

మహబూబాబాద్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు మినహాయింపు ఇవ్వాలని, పంచాయతీ కార్యదర్శుల దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చుక్కల ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డీపీఓ కార్యాలయంలో డీపీఓ హరిప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా చుక్కల ప్రవీణ్ మాట్లాడుతూ.. గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులుగా ఏడాది సేవాకాలం పూర్తి అయినందున శిక్షణ డిక్లేర్ చేస్తూ జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. క్రీడాకోటలో ఎంపికైన 98 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శుల స్పష్టమైన జాబ్‌చార్టును తెలియజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుందర్, రాము, ఉమేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరిస్తూ పనిభారం తగ్గించాలని కోరుతూ సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులు ఎంపీడీఓ శ్రీనివాసనాయక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు వెంకటేష్, కృష్ణప్రసాద్, సాయితేజ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గార్ల: ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి సీపీఎం పార్టీ కార్యకర్తలు పోరాటాలు చేపట్టాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలం అయిందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలనపై ప్రజలు, రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, రానున్న పంచాయతీ ఎన్నికల్లో సీపీఎం తన సత్తాను చాటాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చింత ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి అలువాల సత్యవతి, పెద్దవెంకటేశ్వర్లు, అంబటి వీరస్వామి, నాగమణి పాల్గొన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: కేక్ కట్ చేస్తున్న ఘనపురం అంజయ్య



తొర్రూరు: వేడుకల్లో పాల్గొన్న నాయకులు



డోర్నకల్‌లో..



గార్ల: కేక్ కట్ చేస్తున్న మండల అధ్యక్షుడు రామారావు



కురవి: కేక్‌కట్ చేస్తున్న నాయకులు

ఆదర్శ కమ్యూనిస్టు నారాయణస్వామి



నెహ్రూసెంటర్: నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా పని చేసిన మాదాల నారాయణస్వామి ఆదర్శ కమ్యూనిస్టు అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. నారాయణస్వామి 11వ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, పైండ్ల యాకయ్య, మంగ్య రవి పాల్గొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో శాంతియుతంగా గిట్టుబాటు ధర కోసం పాదయాత్ర చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం సరికాదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు.

కొత్తగూడ: నారాయణ స్వామి ఆశయాలు కొనసాగిస్తామని పార్టీ సబ్‌డివిజన్ కార్యదర్శి శ్రీశైలం అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నారాయణ స్వామి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పుల్లన్న, సూర్యం, యుగేందర్, సోమన్న, పావని, రమ, లక్ష్మి పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే



కేసముద్రం: సర్వే నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటి సభ్యులు మార్తనేని పాపారావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హమీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకన్న, జల్లె జయరాజ్, నీరుటి జలేందర్, ఆవుల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో ప్రజలు

దంతాలపల్లి: మండలంలోని ప్రజలు పలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారని సీపీఎం నాయకులు అన్నారు. మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో సోమవారం పార్టీ నాయకులు ఇంటింటా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బండి శ్రీను, లక్ష్మయ్య, వెంకన్న వీరభద్రం పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మహబూబాబాద్: సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని నాలుగు రోజులుగా దీక్షలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాదర్, జిల్లా అధ్యక్షుడు వీరన్న ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టగా దానిలో భాగంగా సోమవారం అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా హామీల విషయంలో ఊసే లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉదయ్, బాబులాల్, ప్రభాకర్, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

చిన్నగూడూరు: క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందడంతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతాయని ఎంపీడీఓ, మండల క్రీడా చైర్మన్ రామారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా సీఎం కప్ గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా ఉత్సవాలను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుగుణాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు జక్కి నాగేశ్వర్, ఉపాధ్యాయులు పృథ్వీరాజ్, సత్తిరెడ్డి, విమలాదేవి, రమాదేవి, గ్రామస్తులు గాడిపెల్లి జీవన్, గంగాధరి అనిల్ పాల్గొన్నారు.

ప్రయాణికురాలి నగల చోరీ

తొర్రూరు: బస్సు ఎక్కే క్రమంలో ప్రయాణికురాలి నగలు గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటన సోమవారం డివిజన్ కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల మండలానికి చెందిన ఎర్రం శివలక్ష్మి సోమవారం తొర్రూరులో ఉండే కూతురు వద్దకు వచ్చింది. తిరిగి కొడకండ్లకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చి బస్సు ఎక్కుతున్న క్రమంలో హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న బంగారు నగలను చాకచక్యంగా గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బస్టాండ్‌కు చేరుకుని తనిఖీ నిర్వహించారు. సీసీ కెమెరాలను పరిశీలించి నిందితున్ని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

గూడూరు: మండల కేంద్రంలో సోమవారం లోడీ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ, జీవామృతం కషాయాల వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారికి జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు లాంటి మిల్లెట్ పంటలపై, వాటి వినయోగంపై వివరించారు. అనంతరం రైతులకు పలు రకాల విత్తనాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ నిపుణుడు ఎండి షేక్ హుస్సేన్, సురేష్, కర్ర పిచ్చిరెడ్డి, మురళి, యశోద పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లతో శక్తిసామర్థ్యాలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గూడూరు: టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలు వెలుగులోకి వస్తాయని ఎంఈఓ రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో సోమవారం తెలంగాణ బయాలజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం మండల శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలు, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మండల స్థాయిలో మొదటి బహుమతి డి.దేవేందర్ బాలుర హైస్కూల్ గూడూరు, ద్వితీయ బహుమతి పవిత్ర జెడ్పీహెచ్‌ఎస్ పొనుగోడు గెలుపొందారు. వారికి తిరిగి జిల్లా స్థాయి టెస్ట్‌లు ఈనెల 18 న మానుకోట జిల్లా కేంద్రంలో ఉంటాయని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

విజయవంతం చేయాలి

బయ్యారం: ఈనెల 10,11 తేదీల్లో బయ్యారం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం కప్ క్రీడల నిర్వాహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ దేవేంద్రాచారి, ఎస్సై తిరుపతి, దైవాదీనం పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఖాళీలను భర్తీ చేయాలి

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గుణగంటి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని సీపీఎం ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

గార్ల: మండలంలోని ఎస్సీ, బీసీ, బాలుర, బాలికల వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించడంలో సంబంధిత అధికారులు వైఫల్యం చెందారని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ ఆరోపించారు. సోమవారం గార్లలోని వసతిగృహాలను ఆయన సందర్శించారు.

నూతన కమిటీ ఎన్నిక



బయ్యారం: మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా ధారావత్ రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షులు పావని, వేణు, కోశాధికారిగా సురేందర్‌తోపాటు పలువురు సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

ఆశవర్కర్ల మీద దాడి అమానుషం

చిన్నగూడూరు: ఆశవర్కర్ల మీద దాడి అమానుష చర్య అని సేవాలాల్ సేన మండల అధ్యక్షులు బాదావత్ సురేష్ తీవ్రంగా ఖండించారు. ఆశవర్కర్లపై దాడిని ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలో మండల సేవాలాల్ సేన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భూక్య తర్యానాయక్, భూక్య శంకర్, వెంకన్న ఉన్నారు.

మంత్రి వ్యాఖ్యలు నిరసిస్తూ ధర్నా

కొత్తగూడ: మంత్రి సీతక్కపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ధర్నా చేశారు. సీతక్కకు వస్తున్న ప్రజాధరణ ఓర్వలేక బీజేపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని నాయకులు ఆరోపించారు. నాయకులు సారయ్య, మధుసూదన్‌రెడ్డి, సమ్మయ్య, బిట్ల శ్రీను పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంసీపీఐ(యూ), ఏఐసీటీయూ సంఘం నాయకులు సోమవారం సందర్శించారు. ఈమేరకు రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, నాయకులు దారావత్ రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

నర్సింహులపేట: మండల కేంద్రంలోని శివారులో సోమవారం సాయంత్రం పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి నర్సింహులపేటకు చెందిన నలుగురిని అదుపులో తీసుకున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. మూడు బైక్‌లు, రూ.5,870 నగదును స్వాధీనం చేసుకొని నలుగురిని అదుపులో తీసుకుకోగా, మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

ముందస్తు అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: రాష్ట్రంలో సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునివ్వగా హైదరాబాద్ వెళ్తున్న సర్పంచుల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు బోడ లక్ష్మణ్‌నాయక్‌ను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పెద్దవంగర: దాతలు అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవాతరుణి మండల అధ్యక్షురాలు మాధవపెద్ది వాణి అన్నారు. సేవాతరుణి వ్యవస్థాపక అధ్యక్షురాలు శారద జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని బొమ్మకల్లు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిల్స్, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుపతిరెడ్డి, సేవాతరుణి ప్రతినిధులు రాజసుకన్య, మంజుల, విమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

మరిపెడ రూరల్: ఇటీవల బయాలజీ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి బయాలజీ టాలెంట్ టెస్ట్‌లో తెలుగు మీడియం విభాగంలో మండలంలోని వీరారం హైస్కూల్‌కు చెందిన విద్యార్థి శ్రీకాంత్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం లక్ష్మీనిర్మల తెలిపారు. సోమవారం విద్యార్థి శ్రీకాంత్‌కు ప్రశంస పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, మచ్చర్ల రవి, జానకీ, మారెడ్డి, తదితరులు అభినందించారు.

'దళితబంధు' అమలు చేయాలని వినతి



గార్ల: అర్హులైన ప్రతీ ఒక్కరికీ దళితబంధు పథకం అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గిన్నారపు మురళి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వస్తే అర్హులైన దళితులందరికీ అంబేడ్కర్ చేయూత ద్వారా రూ.12లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని ఆరోపించారు. ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంతో దళితులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీరాంకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకన్న, ఎడ్ల రాజేందర్, మురళీకృష్ణ, రామకృష్ణ, విశ్వనాథం, ముత్యం, రాజయ్య పాల్గొన్నారు.